సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 26 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.35

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.35, కనిష్టంగా రూ.20 ప్రకారం ధర పలికింది.



జిల్లా పరిధిలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంతి నిలయం: పర్యాటక రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక అవార్డుల (2023–24 సంవత్సరానికి) అందిస్తుందని, ఇందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి విజయకుమార్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 38 విభాగాలకు సంబంధించి 41 అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నని పేర్కొన్నారు. దరఖాస్తు చేయాలనుకునే వారు ఏపీ టూరిజం వెబ్‌సైట్ https://aptourism.gov.in నుంచి పూర్తి సమాచారంతోపాటు దరఖాస్తు ఫారాలు పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 22వ తేదీలోపు ఏపీ టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేషన్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడ చిరునామాకు పంపాలని సూచించారు. ఈ నెల 27న అవార్డుల ప్రదానం ఉంటుందన్నారు.

మానవ హక్కుల ఉల్లంఘనపై ఫిర్యాదు చేయండి



మాట్లాడుతున్న విజయ భారతి

కదిరి టౌన్ : మానవ హక్కుల ఉల్లంఘనలపై ఫిర్యాదు చేస్తే బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి తెలిపారు. సోమవారం కదిరికి విచ్చేసిన ఆమె..మాజీ ఎమ్మెల్యే పార్థసారథి నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఎక్కడైనా దౌర్జన్యాలు, దాడులు, మహిళలపై వేధింపులు, లైంగిక దాడులు జరిగినపుడు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలన్నారు. అక్కడ స్పందన లేకపోయినా.. పోలీసులు నిర్లక్ష్యం చేసినా.. మానవ హక్కుల కమిషన్‌ను సంప్రదించవచ్చన్నారు. ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టి.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. మానవ హక్కుల కమిషన్ ఎటువంటి ఒత్తిళ్లకూ తలొగ్గదని.. బాధితుల పక్షాన నిలిచి.. మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడుతుందన్నారు.

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుకు ఈనెల 16వ తేదీ వరకు మాత్రమే గడువు ఉండేదని, వివిధ కారణాలతో చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయినందున గడువు ఈనెల 23వ తేదీ వరకూ పొడిగించినట్లు వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



కదిరి టౌన్: కదిరి నూతన డీఎస్పీగా శివనారాయణస్వామి సోమవారం బాధ్యతలు చేపట్టారు. డివిజన్‌లో ఉన్న సీఐలు, ఎస్‌ఐలు నూతన డీఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. డీఎస్పీ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడతామని చెప్పారు.



వైద్య విద్యను దూరం చేసే కుట్ర

కూటమి ప్రభుత్వం నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు వైద్య విద్యను దూరం చేసేందుకు కుట్ర పన్నుతోంది. అందులో భాగంగానే వైఎస్సార్ సీపీ హయాంలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్లు లేకుండా చేసింది. పెనుకొండలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాల పనులనూ అడ్డుకోవడం బాధాకరం. నా కుమారుడు కోచింగ్ తీసుకుని నీట్ పరీక్ష రాశాడు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు అందుబాటులోకి వచ్చి ఉంటే.. సీట్లు పెరిగి నా కుమారుడికి స్థానికంగానే సీటు దక్కేది. ఇప్పుడు ప్రైవేటుకు వెళ్లాలంటే రూ.లక్షల్లోనే వెచ్చించాలి.

– రాము, మడకశిర



పేద విద్యార్థులకు అన్యాయం



రాష్ట్రానికి మంజూరైన మెడికల్ కళాశాలల నిర్మాణాలను ఆపేయడంతో పాటు, వైద్య విద్యను ప్రైవేటీకరించడం వల్ల రాష్ట్రంలో మెడిసిన్ చేయాలనుకునే పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. వెంటనే ప్రభుత్వం తన నిర్ణయాలను మార్చుకోవాలి. రాష్ట్రంలో తక్కువ సీట్లు ఉండడంతో ఎంతో మంది విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు లేదా విదేశాలకు వెళ్లి మెడిసిన్ చదువుకోవాల్సిన పరిస్థితి. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలలను వెంటనే పూర్తి చేసి.. మెడిసిన్ సీట్లను అందుబాటులోకి తీసుకురావాలి.

– భవ్య శ్రీ, మెడిసిన్ విద్యార్థి ,పుట్టపర్తి



ఆశలు ఆవిరి!

☛ పుట్టపర్తి మండలం ఇరగరాజుపల్లికి చెందిన ఓబుళప్ప ఖరీఫ్‌లో 4 ఎకరాల్లో వేరుశనగ, కంది సాగు చేశాడు. విత్తనాలకు రూ.22 వేలు, సాగుకు రూ.18 వేలు, ఎరువుల కోసం రూ.8 వేలు, గడ్డి తొలగించడానికి 40 మంది కూలీలకు రూ.12 వేలు, ఒకసారి మందుల పిచికారీకి రూ.6 వేలు కలిపి ఇప్పటి వరకూ మొత్తంగా రూ. 66 వేలు ఖర్చు చేశాడు. విత్తనం వేసిన రెండు నెలలుగా తీవ్ర వర్షాభావం ఏర్పడడంతో వేరుశనగ, కంది పంట పూర్తిగా ఎండుముఖం పట్టాయి. ఇప్పటికిప్పుడు వర్షం కురిసినా పంట చేతికి వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలని ఓబుళప్ప దీనంగా వేడుకుంటున్నాడు.

☛ కొత్తచెరువు మండలం యర్రబల్లికి చెందిన సూర్యనారాయణ రూ.30 వేలు ఖర్చు చేసి రెండెకరాల్లో వేరుశనగ సాగు చేశాడు. విత్తనం వేసి రెండు నెలలు దాటినా సరైన వర్షం కురవక పోవడంతో మొలకెత్తిన పంట ఎండుతోంది. దీంతో పెట్టుబడి, తన రెక్కల కష్టం వృథా అయ్యిందని సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

...జిల్లాలోని రైతులందరిదీ ఇదే పరిస్థితి. ఖరీఫ్ ప్రారంభంలో మురిపించిన వరుణుడు, ఆ తర్వాత ముఖం చాటేయడంతో పంటలన్నీ ఎండుముఖం పట్టాయి. దిగుబడి పక్కన పెడితే కనీసం పశువులకు మేత కూడా దక్కే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- జిల్లాలో తీవ్ర వర్షాభావం
- పదునైన వాన లేక ఎండుతున్న పంటలు
- వేలాది ఎకరాల్లో దిగుబడి ప్రశ్నార్థకం
- ఆందోళనలో రైతన్నలు



కొత్తచెరువు మండలం యర్రపల్లి వద్ద ఎండుతున్న కంది, వేరుశనగ పంటలు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో తీవ్ర వర్షాభావం నెలకొంది. సీజన్ ఆరంభంలో విస్తారంగా వర్షించిన వరుణుడు విత్తనం పద్దాక ముఖం చాటేశాడు. రెండు నెలలుగా జిల్లాలో పదునైన వర్షం కురవకపోవడంతో ఖరీఫ్ పంటలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. జిల్లా రైతులంతా ఎక్కువగా వర్షాధార పంటలే సాగు చేస్తారు. అందులో ముఖ్యంగా వేరుశనగ, కంది, మొక్కజొన్న తదితర పంటలను వేస్తారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యాక ఆగస్టు 16, 17 తేదీల్లో మంచి వర్షాలు కురిశాయి. దీంతో రైతులంతా ఉత్సాహంగా పంటలు సాగు చేశారు. అయితే ఆ తర్వాత పదునైన వాన కురవలేదు. దీంతో వేసిన పంటలన్నీ ఎండిపోతుండగా... ప్రత్యమ్నాయం వైపు కూడా రైతులు దృష్టి సారించడం లేదు.

4.07 లక్షల ఎకరాల్లో పంటలు..

ఖరీఫ్‌లో జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 5.10 లక్షల ఎకరాలు కాగా, ఈసారి 4.07 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. ఇందులో వర్షాధారంతో పాటు బోరు బావుల కింద సాగు చేసిన పంటలూ ఉన్నాయి. కాస్త ఆలస్యంగా పంట సాగుచేద్దామనుకున్న రైతులు వర్షాలు లేక పంటలు వేయలేకపోయారు. దీంతో సుమారు 1.03 లక్షల ఎకరాలు సాగులోకి రాలేదు. ఆయా రైతుల కోసం ప్రభుత్వం ప్రత్యామ్నాయం కింద ఉలవలు అందుబాటులో ఉంచింది. అయితే పదునైన వాన లేకపోవడంతో వీటిని సాగు చేయడానికి రైతులు ముందుకు రాలేదు.

పంట చేతికి వచ్చే పరిస్థితి లేదు..

ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో వేరుశనగ పంటను అత్యధికంగా సాగు చేశారు. ఆగస్టు మధ్యలో వర్షాలు బాగా కురిసి పంట ఏపుగా పెరిగింది. ప్రస్తుతం సుమారు నెల రోజుల నుంచి అక్కడక్కడా తుంపర్లు తప్ప సరైన వాన లేదు. దీంతో పంటలన్నీ దెబ్బతిన్నాయి. చాలా మండలాల్లో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. దీంతో రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు రూ.20 వేలకు పైగా ఖర్చు చేశామని, ఇప్పుడు పరిస్థితి చూస్తే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదంటున్నారు. ప్రభుత్వం పంటల నమోదు చేసి పరిహారం వచ్చే విధంగా చూడాలంటున్నారు. ప్రస్తుతం మూడు రోజుల నుంచి ఎండ తీవ్రత పెరగడంతో పంటలు కోలుకోలేక పోతున్నాయి.

ఆశలు రేపి..అడియాసలు చేసి..

జిల్లాలోని కొన్ని చోట్ల మంచి వర్షాలు కురిసినా, సగటున తక్కువ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. జూన్ సాధారణ వర్షపాతం 66.6 మి.మీ, కాగా నైరుతి రుతు పవనాల ప్రభావంతో రూ.148.9 మి.మీ వర్షం కురిసింది. జూలై సాధారణ వర్షపాతం 71 మి.మీ కాగా, 42.9 మి.మీ నమోదైంది. ఇక ఆగస్టులో 94 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా..సగటున 189.2 మి.మీ వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్‌లో 55 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, ఇప్పటి వరకూ కేవలం 10.3 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 15 వరకూ తుంపర తప్ప మోస్తరు వర్షం కూడా కురవలేదు. దీంతో ఖరీఫ్ పంటలన్నీ దెబ్బ తిన్నాయి.

ఇప్పటికే రూ. లక్ష ఖర్చు



నేను రూ.లక్ష ఖర్చు చేసి బోరు బావి కింద 3 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. 20 రోజుల నుంచి బోరులో నీళ్లు రావడం లేదు. పంట పూర్తిగా దెబ్బతినింది. నెల రోజులుగా వర్షాలు కురవక పోవడంతో వేరుశనగ ఎండిపోతోంది. పశువుల మేత కూడా దక్కే పరిస్థితి లేదు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి.

– మోహన్‌రెడ్డి, రైతు, చౌటకుంటపల్లి, నల్లమాడ మండలం

మేత కూడా దక్కదు



తీవ్ర వర్షాభావంతో పశువులకు మేత కూడా దక్కే పరిస్థితి లేదు. వ్యవసాయంతో పాటు పాడి పైన ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది రైతులకు ఇది కష్ట కాలం. ఉత్తర కార్తెలోనైనా వర్షం కురవక పోతే రైతులందరిదీ ఎత్తర గంప పరిస్థితి. ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలి. రైతు భరోసా జమ చేసి ఆదుకోవాలి. లేకపోతే మళ్లీ బెంగళూరులాంటి నగరాలను వలసలు తప్పవు.

– రంగనాథ్, ఇరగరాజుపల్లి, పుట్టపర్తి మండలం

ఎప్పటికప్పుడు నివేదికలు



వర్షాభావంతో పంటలు ఎండుతున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నాం. తీవ్ర వర్షాభావం వల్ల ప్రత్యామ్నాయ సాగు కూడా ఆశించినంతగా లేదు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నాం. ఈ మేరకు పూర్తి సమాచారం పంపుతున్నాం.

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి



చిలమత్తూరు లో ఊరేగింపుగా వెళుతోన్న గణేష్ భారీ విగ్రహం

గణపతి బప్పా మోరియా



రొద్దంలో భారీ జనసందోహం మధ్య నిమజ్జనానికి తరలివెళ్తున్న 21 అడుగుల వినాయకుడు

- ఘనంగా వినాయక నిమజ్జనం

చిలమత్తూరు/రొద్దం: చవితి రోజున కొలువుదీరి పూజలందుకున్న బొజ్జగణపయ్యను భక్తులు భక్తిశ్రద్ధలతో గంగఒడికి చేర్చారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన గణేశ్ నిమజ్జనం కమనీయంగా సాగింది. వినాయకుడి శోభాయాత్రలో యువత రంగులు చల్లుకుంటూ నృత్యాలు సందడి చేశారు. చిలమత్తూరు వాల్మీకి నగర్, ఎస్సీ కాలనీలో కొలువుదీర్చిన వినాయకుడి విగ్రహాలను నిర్వాహకులు సోమవారం ఊరేగించి చిలమత్తూరు చెరువులో నిమజ్జనం చేశారు. రొద్దంలో వినాయక నిమజ్జనం సోమవారం భక్తిశ్రద్ధలతో సాగింది. 21 అడుగుల వినాయకుడి విగ్రహాన్ని ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనం చేశారు.

లక్షలిస్తే.. లక్షణమైన పోస్టింగ్



- ఎక్సైజ్ శాఖలో జోరుగా లాబీయింగ్
- కూటమి నేతల చుట్టూ సీఐల ప్రదక్షిణ
- పోస్టింగ్ కోసం రూ.లక్షల ముడుపులు
- కర్ణాటక సరిహద్దు స్టేషన్‌లకు డిమాండ్

సాక్షి, పుట్టపర్తి

ఎక్సైజ్ శాఖలో బదిలీల పర్వం.. కొందరికి వ్యాపారంలా మారింది. పోస్టింగులు ఇప్పించేందుకు అధికారుల నుంచి రూ.లక్షలు దండుకుంటున్నారు. జిల్లా పరిధిలో కర్ణాటక సరిహద్దులో ఉన్న స్టేషన్లకు భారీ డిమాండ్ నెలకొంది. దీంతో ఆయా స్టేషన్లకు వెళ్లేందుకు పలువురు సీఐలు ఆసక్తి చూపుతుండగా...రేటు పెరుగుతోంది. మరోవైపు ఎక్సైజ్ శాఖలో ప్రమోషన్ల పర్వం నడుస్తోంది. దీంతో బదిలీల పర్వం గందరగోళంగా మారింది. అయినా ఈ నెలాఖరుకు బదిలీలు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఒక్కో ఎస్‌ఐ, సీఐకి మూడు ప్రాంతాలు ఎంచుకునేందుకు ఆప్షన్లు ఇచ్చారు. ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్సుమెంట్ విభాగాల్లో బదిలీలు చేపట్టారు. కొందరు అధికారులకు రాజకీయ రంగు పూయడంతో ఎమ్మెల్యేల నుంచి సిఫారసులు కష్టంగా మారింది. దీంతో వారంతా ఎక్కడ పోస్టింగ్ వచ్చినా వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇక కుల సమీకరణాల్లో భాగంగా కొందరికి డిమాండ్ ఉన్న స్టేషన్లు ఇచ్చేందుకు రాజకీయ సిఫారసులు వెళ్లినట్లు తెలుస్తోంది. గతంలో తమకు అనుకూలంగా ఉన్న అధికారులను మళ్లీ తెచ్చుకునేందుకు కూటమి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఒకరిద్దరి సమక్షంలోనే..

ఎక్సైజ్ శాఖలో బదిలీలన్నీ.. ఒకరిద్దరి సూచనమేరకే నడుస్తున్నట్లు సమాచారం. ఆ ఇద్దరు విజయవాడలో కూర్చుని బదిలీల రాజకీయం చేస్తున్నారని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా బదిలీల ప్రక్రియను వ్యాపారంగా మార్చుకుని రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. డిమాండ్ ఉన్న ప్రాంతాలకు పోస్టింగ్ కోసం ఒక్కో సీఐ నుంచి రూ.5 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. మద్యం పాలసీ మారనున్న నేపథ్యంలో ఊరూరా బెల్టు షాపులు నడుస్తాయని, తద్వారా భారీగా వసూళ్లు చేయవచ్చని కొందరు అధికారులు భారీగా ఇచ్చేందుకు ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రమోషన్ల లొల్లి..

ఓవైపు బదిలీల ప్రక్రియ గందరగోళంగా సాగుతుండగా... మరోవైపు ప్రమోషన్ల అంశం కలకలం రేపుతోంది. సర్వీసుతో సంబంధం లేకుండా.. నోటిఫికేషన్ల ఆధారంగా పదోన్నతులు కల్పించేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం తమకు అనుకూలమైన వారికి పదోన్నతి కల్పించేందుకు ఇలా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం దారుణమని సీనియర్లు వాపోతున్నారు.

పోస్టింగ్ కోసం లాబీయింగ్..

జిల్లా పరిధిలో చెన్నేకొత్తపల్లి, పెనుకొండ, మడకశిర, హిందూపురం, తనకల్లు స్టేషన్లు కర్ణాటక సరిహద్దులో ఉన్నాయి. పుట్టపర్తి, ధర్మవరం, కదిరి స్టేషన్‌లు పూర్తిగా ఆంధ్రలో ఉంటాయి. కర్ణాటక సరిహద్దున హిందూపురం పరిధిలో తూమకుంట, కొడికొండ వద్ద చెక్‌పోస్టులు ఉన్నాయి. జిల్లా టాస్క్‌ఫోర్స్‌లో ఒక సీఐ, ఎన్‌ఫోర్సుమెంట్‌లో ముగ్గురు సీఐల నియామకాలు ఉంటాయి. దీంతో సరిహద్దులోని స్టేషన్‌కు పోస్టింగ్ వేయించుకునేందుకు పలువురు సీఐలు, ఎస్‌ఐలు నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరు విజయవాడలో లాబీయింగ్ నెరుపుతున్నారు. ఇంకొందరు మాత్రం క్యాస్ట్‌ను అడ్డంపెట్టి పోస్టింగ్ దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

యా నబీ సలాం అలైకా..

- భక్తి శ్రద్ధలతో మిలాద్–ఉన్– నబీ
- జిల్లా వ్యాప్తంగా ప్రార్థనలు, ర్యాలీలు
- ప్రవక్త జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్న ముస్లింలు

పుట్టపర్తి టౌన్: మహమ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్–ఉన్–నబీని సోమవారం ముస్లింలు జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రాలు, ప్రధాన పట్టణాల్లో ర్యాలీలు నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యా నబీ సలాం అలైకా...యా రసూల్ సలాం అలైకా.. అంటూ రోజంతా పఠించారు. కదిరి, హిందూపురం, ధర్మవరం, మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి తదితర పట్టణాల్లో ర్యాలీలు భారీగా సాగాయి. ఆయా చోట్ల జరిగిన ప్రార్థనల్లో మత పెద్దలు తమ సందేశం వినిపించారు. మహమ్మద్ ప్రవక్త సూచించిన విధంగా ముస్లింలంతా శాంతి, ధర్మం, సమానత్వంతో జీవనం సాగించాలన్నారు. అల్లాహ్ మార్గం అనుసరణీయమని, అందరూ పాటించాలన్నారు. పలుచోట్ల ప్రజా ప్రతినిధులు ర్యాలీలు ప్రారంభించి ప్రార్థనల్లో పాల్గొన్నారు.



హిందూపురం: ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు



ర్యాలీ సందర్భంగా గుర్రంపై విన్యాసాలు చేస్తున్న యువకుడు



పుట్టపర్తి: మసీదుల్లో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



అమరాపురంలో ర్యాలీగా వస్తున్న ముస్లింలు



పరిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలు

గుడిబండ: విద్యుత్ షాక్‌కు గురై 9 గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం ఎమ్ఎస్ తండాకు చెందిన దైవలీబాయి గొర్రెల పోషణతో జీవనం సాగిస్తోంది. ఆదివారం రాత్రి గొర్రెలను మేపు నుంచి తోలుకొచ్చిన ఆమె ఇంటి సమీపంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న ఇనుప కంచెలోకి తోలి నిద్రించింది. సోమవారం తెల్లవారుజామున బలమైన గాలులు వీయడంతో విద్యుత్ తీగలు తెగి గొర్రెలపై పడింది. దీంతో కరెంట్ షాక్‌కు గురై 9 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. దాదాపు రూ. 1.5 లక్షల మేర నష్టపోయినట్లు బాధితురాలు వాపోయింది.

చెరువులో వృద్ధురాలి మృతదేహం

రొళ్ల: మండలంలోని కాకి గ్రామ చెరువులో ఓ వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. మృతురాలిని కర్ణాటకలోని మధుగిరి తాలూకా తాయిగొండనహళ్లికి చెందిన తిమ్మక్క (65)గా గుర్తించారు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... తిమ్మక్క తన ఇద్దరు కుమార్తెలను కాకి గ్రామానికి చెందిన రంగప్ప, నరసింహప్పకు ఇచ్చి పెళ్లి చేసింది. ఈ క్రమంలోనే గత రెండేళ్లుగా తన ఇద్దరు కుమార్తెల వద్దనే ఉంటూ వస్తున్న ఆమె సోమవారం ఉదయం నుంచి కనిపించకుండా పోయింది. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. సాయంత్రం చెరువులో తేలియాడుతున్న తిమ్మక్క మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెలికి తీశారు. అయితే ఆమె ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిందా? లేక ఆత్మహత్య చేసుకుందా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



నూతన కళాశాలలు చాలా అవసరం

రాష్ట్రంలో వైద్య అవసరాలు దృష్టిలో ఉంచుకుని నూతన కళాశాలల ఏర్పాటు చాలా అవసరం. ఇలాంటి తరుణంలో 5 కళాశాలల్లో 700 సీట్లు రద్దు చేయడం, మరో 7 కళాశాలల నిర్మాణాలు నిలిపివేయడం సరైన విధానం కాదు. ఏటా దేశవ్యాప్తంగా 26 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాస్తున్నారు. ఎంబీబీఎస్ సీట్లు 1.20 లక్షలు మాత్రమే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నూతన కళాశాలల ఆవశ్యకత ఎంతైనా ఉంది. వైద్య కళాశాలలపై కూటమి ప్రభుత్వం పునరాలోచించాలి.

– అర్షియా, ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం, కుమ్మరవాండ్లపల్లి, కదిరి మండలం



వైద్య విద్య ప్రైవేటీకరణ సరికాదు



2024–25 విద్యాసంవత్సరం నూతన మెడికల్ కళాశాలలు నడపలేమని ఎన్ఎంసీకి కూటమి ప్రభుత్వం లేఖ రాయడం దౌర్భాగ్యం. రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 5 మెడికల్ కళాశాలల్లో వెంటనే అడ్మిషన్లు చేపట్టాలి. 700 సీట్లు భర్తీ చేయాలి. అలాగే నిర్మాణంలో ఉన్న మరో 7 కళాశాలలను పూర్తి చేసి సీట్లు అందుబాటులోకి తేవాలి. వైద్య విద్యను పేద విద్యార్థులకు చేరువచేసే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలి.

– బాబ్జాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు, కదిరి

అపూర్వం... అమోఘం

ఏదైనా నిర్ణయం తీసుకున్నప్పుడు దానిని ఆచరణలో పెట్టినప్పుడే సార్థకత ఉంటుంది. అయితే చాలా మంది ఈ విషయంలో విఫలమవుతుంటారు. తమ చిన్ననాటి మిత్రుల కష్టాలు చూసి చలించిన పూర్వ విద్యార్థులు ఇందుకు విరుద్ధంగా నిలిచారు. కష్టాల్లో ఉన్న తోటి స్నేహితులను ఆదుకోవడంతో పాటు తమ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు.



నాటి గురువులతో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు (ఫైల్)

- ఆదర్శంగా నిలుస్తున్న పూర్వవిద్యార్థులు
- హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా సేవా కార్యక్రమాలు

లేపాక్షి: ఉమ్మడి అనంతపురం జిల్లా కాళసముద్రం వద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 1988లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అనంతరం ఉన్నత చదువుల పేరుతో వేర్వేరు కళాశాలల్లో చేరారు. ఆ తర్వాత ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడి యాంత్రిక జీవనంలో నిమగ్నమైన వారంతా ఒకరిద్దరి చొరవతో దాదాపు 50 మంది 30 ఏళ్ల తర్వాత 2018, నవంబర్ 30న అనంతపురంలో భేటీ అయ్యారు. తాము చదువుకుంటున్న సమయంలో చేసిన అల్లర్లు, చిలిపి పనులు గుర్తు చేసుకుని మురిసి పోయారు. ఈ క్రమంలోనే ఒకరి కష్టసుఖాలు మరొకరు తెలుసుకున్నారు.

ఏడాది తర్వాత మొదలైన చేయూత..

పూర్వ విద్యార్థులు భేటీ అయిన సమయంలో కష్టాల్లో ఉన్న తోటి స్నేహితులను ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు.



లేపాక్షిలోని జటాయువు వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో సభ్యులు (ఫైల్)



చనిపోయిన మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం (ఫైల్)

అయితే దీనిని అంతటితో ఆపకుండా 2019, జనవరిలో 'కాళసముద్రం 1988 హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్' పేరుతో సంస్థను రిజిస్టర్ చేయించారు. 'చెయ్యి.. చెయ్యి కలుపుదాం – పదిమందికి చేయూతనిద్దాం' నినాదంతో ముందుకు వెళ్లారు. ఉద్యోగాలు చేసే ప్రతి ఒక్కరూ తమ నెలవారీ జీతంలో నుంచి కొంత మొత్తాన్ని సంస్థ బ్యాంక్ ఖాతాల్లోకి బదిలీ చేసేలా బ్యాంకర్లకు అంగీకార పత్రాన్ని ఇవ్వడంతో నిధుల సమీకరణకు మార్గం సుగమమైంది. 2019, జనవరి 27న కాళసముద్రంలోని పాఠశాలలో 'పూర్వ విద్యార్థుల సమ్మేళనం' నిర్వహించి తమ నిర్ణయాన్ని, కార్యాచరణను అందరికీ వివరించారు. అదే సమయంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను ఘనంగా సన్మానించి వారి చేతుల మీదుగానే సంస్థను లాంఛనంగా ప్రారంభించారు. శిష్యుల ఔదార్యానికి ముగ్ధులైన ఉపాధ్యాయులు సైతం తమకు తోచినంత ఆర్థిక సాయాన్ని విరాళం రూపంలో అందజేయడంతో అసోసియేషన్‌కు నూతన జవసత్వాలు చేకూరాయి. ఆ గురువుల స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తూ వచ్చారు. ఆపదలో ఉన్న తోటి స్నేహితులను ఆదుకోవడంతో పాటు నిరుపేద విద్యార్థులకు చదువులు, మొక్కలు నాటడడం, స్వచ్ఛభారత్, క్రీడాభివృద్ధి తదితర కార్యక్రమాలను ఎంచుకున్నారు.

సంస్థ ద్వారా చేపట్టిన కార్యక్రమాలు..

- తాము చదువుకున్న పాఠశాలకు రూ. 50 వేల విలువ చేసే యూపీఎస్, ఇన్వర్టర్, విద్యార్థులు కూర్చొనేందుకు బెంచీలు ఏర్పాటు చేశారు.
- తమతో పాటు కలసి చదువుకున్న దొడ్డప్ప మృతి చెందడంతో ఆయన కుటుంబానికి రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు.
- లేపాక్షిలోని జటాయువు ప్రాంతం, హిందూపురం ఆర్టీసీ ఆవరణలో మొక్కలు నాటారు.
- కరోనా సమయంలో మిత్రుల్లో పేదవారైన 11 మందికి రూ.1.10 లక్షలు విలువైన సరుకులను అందజేశారు.
- పుల్వామా ఉగ్రవాదులు జరిపిన దాడిలో అమరులైన సీఆర్‌పీఎఫ్ జవాన్ల సహాయ నిధికి రూ. 10 వేలు విరాళం పంపారు.
- పెద్ద మొగలాయి పల్లిలో రూ.10 వేలు విలువ చేసే పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు.
- మిత్రుడు తిమ్మప్ప కుమార్తె నర్సింగ్ చదువుకు రూ.40 వేలు ఆర్థిక సాయం అందించారు.
- మిత్రుల కుటుంబాల్లో ఆడపిల్ల వివాహం జరిగితే పసుపు కుంకుమ కింద రూ.10 వేలు ఆర్థిక సాయం అందిస్తూ వస్తున్నారు.

ప్రతి 3 నెలలకు ఓ సమావేశం



'కాళసముద్రం 1988 హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్'కు అధ్యక్షుడిగా ఉన్నా. ప్రతి 3 నెలలకు ఓ సారి సమావేశమై సేవా కార్యక్రమాలకు సంబంధించిన కార్యాచరణను రూపొందించుకుని, ఆ దిశగా ముందుకు పోతున్నాం. మా సేవా కార్యక్రమాలకు మంచి స్పందన వస్తోంది.

– బి.శాంతరాజు, ఉపాధ్యాయుడు, ముత్తువకుంట్ల, కనగానపల్లి మండలం

చాలా సంతోషంగా ఉంది



మా పూర్వ విద్యార్థుల సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్నా. మా ఉపాధ్యాయులే మాకు స్ఫూర్తి. సంస్థ ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి పర్యావరణ పరిరక్షణకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకున్నాం. అలాగే నిరుపేద విద్యార్థులను గుర్తించి, వారికి చదువులకు ఆర్థిక చేయూతనిస్తున్నాం. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి, క్రీడాభివృద్ధికి సహకరిస్తున్నాం.

– శివకుమార్, ఫిజికల్ డైరెక్టర్, కొండూరు, లేపాక్షి మండలం

వివాహిత ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న రామాంజినమ్మ

ధర్మవరం అర్బన్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్యకు ప్రయత్నించింది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని గుట్టకిందపల్లికి చెందిన రామాంజినమ్మ, ఆదినారాయణ దంపతులు. చిన్నపాటి అంశానికి సోమవారం భర్తతో గొడవ పడిన ఆమె ఇంట్లో ఉన్న ఊజీ గుళికలు మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై ధర్మవరం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

దళిత బాలికపై అత్యాచారం

రొద్దం(పరిగి): మండలంలోని ఓ గ్రామంలో నివాసముంటున్న దళిత కుటుంబానికి చెందిన 16 ఏళ్ల బాలికపై అత్యాచారం జరిగింది. సోమవారం తన ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బలాత్కరించాడు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ప్రమాదంలో డ్రైవర్ మృతి



మృతుడు అశోక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: బొలెరో వాహనం చెట్టును ఢీకొన్న ఘటనలో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఓడీచెరువు గ్రామానికి చెందిన రైతుల వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ సరఫరా అందించేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను సోమవారం సాయంత్రం బొలెరో వాహనంలో ఎక్కించుకుని ఓడీసీలోని వైఎస్సార్ కాలనీకి చెందిన డ్రైవర్ అశోక్‌కుమార్ (23) బయలుదేరాడు. పుట్టపర్తి మండలం వీరాంజనేయపల్లి సమీపంలోకి చేరుకోగానే నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఘటనలో అశోక్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రైతు తిరుపాల్‌తో పాటు స్వల్ప గాయాలైన రైతులు సునీల్‌కుమార్, రామకృష్ణను స్థానికులు వెంటనే పెనుకొండలోని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పుట్టపర్తి రూరల్ ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

సామాన్యులకు 'కూటమి' షాక్

- వంట నూనె దిగుమతి సుంకాలను 20 శాతం పెంచిన కేంద్రంలోని కూటమి సర్కార్
- లీటరుపై రూ.25 వరకూ ధరల పెంపు
- ధరలు మరింత పెరిగేలా కృత్రిమ కొరత సృష్టి

కేంద్రంలోని కూటమి సర్కార్ తీరుతో వంట నూనె ధరలు అమాంతం ఆకాశాన్ని అంటాయి. దిగుమతి సుంకాలను 20 శాతానికి పెంచేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో వంట నూనె సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకుంది.



హిందూపురం అర్బన్: నిత్యావసర సరుకుల ధరలు ఇప్పటికే గణనీయంగా పెరగడంతో వంటగదిలోకి వెళ్లాలంటే సామాన్యుడు బెంబేలెత్తిపోతున్నాడు. ధరలు భగ్గుమని మండుతున్న ఉల్లి.. వెల్లుల్లి జాబితాలోకి తాజాగా వంట నూనె వచ్చి చేరింది. దీంతో నోటికి రుచిగా ఏమైనా చేసుకుని తిందామనుకునే సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఒక్కసారి ఆలోచించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

ఎన్నికల హామీని తుంగలో తొక్కి..

తాము అధికారంలోకి వస్తే నిత్యావసరాల ధరలు నియంత్రిస్తామంటూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి పార్టీలు తుంగలో తొక్కేసాయి. అధికారం చేపట్టి మూడు నెలలు కావస్తున్నా... ఉల్లి, వెల్లుల్లి ధరలు ఏ మాత్రం తగ్గలేదు. కనీసం ధరల నియంత్రణకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. తాజాగా వంట నూనెల దిగుమతిపై కేంద్రం 12.5 నుంచి 32.5 శాతానికి పెంచడంతో లీటరుపై రూ.20 నుంచి రూ.25 వరకూ ధరలు పెరిగాయి. ఈ ధరలు మరింత పెరిగే అవకాశముందంటూ కొందరు వ్యాపారులు తమ వద్ద ఉన్న నిల్వలను దాచేసి కృత్రిమ కొరతను సృష్టించారు. దీనికి తోడు వంట నూనె కంపెనీల యాజమాన్యాలు మరో అడుగు ముందుకేసి వరుసగా నాలుగైదు రోజుల పాటు సరఫరాను నిలిపివేశాయి. కొన్ని దుకాణాల్లో వంట నూనె లేదని చెబుతుండగా.. మరికొన్ని దుకాణదారులు ధరలు పెరుగుదలతో సరుకు సరఫరా కావడం లేదని బుకాయిస్తున్నారు. పాత నిల్వలను అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

మార్కెట్‌లో నూనెల ధరలు ఇలా..			
వంట నూనె	పాత ధర	కొత్త ధర	కిలోపై తేడా
పామాయిల్	రూ.95	రూ.114	రూ.19
సన్ ఫ్లవర్	రూ.113	రూ.133	రూ.20
సోయాబిన్	రూ.108	రూ.129	రూ.21
వేరుశనగ	రూ.220	రూ.228	రూ.28



ధరలు పెంచేసి.. భారం మోపి..

కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై సుంకాన్ని భారీగా పెంచింది. పామాయిల్, సన్‌ఫ్లవర్, సోయాబిన్ వంటి వంట నూనెలకు గతంలో బేసిక్ కస్టమ్స్ సుంకాలు ఉండేవి కావు. ప్రస్తుతం వాటిపై కేంద్రం 20 శాతం దిగుమతి సుంకాన్ని విధించింది. శుద్ధి చేసిన వంట నూనెలపై గతంలో 12.5 శాతం ఉన్న సుంకాన్ని 32.5 శాతానికి పెంచేసింది. దీంతో లీటరు ప్యాకెట్‌పై రూ. 20 నుంచి రూ.25 వరకూ ధరలు పెరిగాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 9.68 లక్షల కుటుంబాలు ఉండగా.. ప్రతి నెలా కేవలం వంట నూనె పైనే సుమారు రూ. 6.86 కోట్ల మేర భారం ప్రజలపై పడుతోంది. గతంలో వంట నూనె, కంది పప్పు ధరలు పెరిగినప్పుడు చౌకధాన్యపు దుకాణాల ద్వారా ప్రభుత్వాలు సరఫరా చేసేది. ఈ నేపథ్యంలో వంట నూనె ధరలు పెరిగిన ప్రస్తుత తరుణంలో చౌకదుకాణాల ద్వారా సబ్సిడీపై అందించాలని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై చర్యలు తీసుకోవడంతో పాటు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు.

మోయలేని భారం



ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు బాగా పెరిగిపోవడంతో చాలా వరకూ వంటలు తగ్గించాం. నూనెల ధరలు కూడా పెంచేశారు. ఇంటికి బంధువులు వస్తే భయపడాల్సి వస్తోంది. ఒక్కసారిగా కేంద్రం ధరలు పెంచి పేదలపై మోయలేని భారాన్ని వేసింది. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి. వంట నూనెతో పాటు నిత్యావసర సరుకులు, కాయగూరల ధరలు నియంత్రించాలి.

– రామాంజినేయులు, చిలమత్తూరు

ధరలు నియంత్రించాలి..



ఓ వైపు వ్యవసాయ ఖర్చులు, కుటుంబసభ్యుల వైద్యం ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఇప్పుడు నిత్యావసర సరుకులు, ఆయిల్ ధరలు పెంచారు. వాటిని కొనుగోలు చేయాలంటే భయమేస్తోంది. దీనికి తోడు స్థానిక వ్యాపారులు కూడా మరో 5 శాతం పెంచి అమ్ముతున్నారు. ఇదేమంటే సరుకు లేదంటున్నారు. ప్రభుత్వం స్పందించి ధరలు నియంత్రించాలి.

– చౌడమ్మ, మరువకొత్తపల్లి, చిలమత్తూరు మండలం

కక్ష సాధింపు చర్యలు సరికాదు

శివసాయి కన్‌స్ట్రక్షన్ అధినేత ప్రణీత్‌రెడ్డి



కదిరి టౌన్: 'గత సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పనిచేశామని మాపై మైనింగ్ అధికారులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఇది సరైంది కాదు' అని శివసాయి కన్‌స్ట్రక్షన్ అధినేత కె.వి ప్రణీత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కదిరి మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్లలోని తన స్వగృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబమేనన్నారు. తన తండ్రి రమేష్‌రెడ్డి కదిరి మున్సిపల్ చైర్మన్‌గా పని చేశారని గుర్తు చేశారు. గాండ్లపెంట మండల టీడీపీ మాజీ కన్వీనర్ వెంకట్రామిరెడ్డి, నల్లచెరువు మండలం సంజీవుపల్లి వద్ద టీడీపీ నేత కృష్ణమోహన్‌నాయుడు, కేసీవీఆర్ కన్‌స్ట్రక్షన్, తలుపుల మండలం బట్రేపల్లి వద్ద కడపకు చెందిన టీడీపీ నేత రామాంజనేయులు... గుట్టలు తవ్వుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అయితే కన్‌స్ట్రక్షన్ రంగంలో స్థిరపడిన తాము సొంతంగా ఏర్పాటు చేసిన నాలుగు క్రషింగ్ యూనిట్లపై అధికారులు అతి తక్కువ సమయంలో నాలుగు సార్లు తనిఖీలు చేపట్టారన్నారు. ఇదే విషయంగా అధికారులను ప్రశ్నిస్తే తమపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని, మీ క్రషర్‌ను మూసివేయండి అని వేధిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు సాగిస్తున్న టీడీపీ నేతలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మైనింగ్ శాఖ డీఈపై గత నెల 12న తాను నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ తరహా కక్ష సాధింపు చర్యలు తగవని, ఇప్పటికైనా అధికారుల తీరు మారాలని హితవు పలికారు. తన క్రషర్‌పై 4 సార్లు తనిఖీలు చేసి రూ.12.84 కోట్లకు డిమాండ్ నోటీస్ ఇచ్చారన్నారు. ఇలాంటి బెదిరింపులకు తాను భయపడనని, న్యాయపరిధిలోనే సమస్యను తేల్చుకుంటానని అన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

- మంత్రులు సత్యకుమార్‌యాదవ్, సవిత



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

పుట్టపర్తి టౌన్: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా ఉన్న జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా మంత్రులు సత్యకుమార్, సవిత భరోసానిచ్చారు. పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హిందూపురం ఎంపీ పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎమ్ఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు పాల్గొన్నారు. మంత్రులు మాట్లాడుతూ... అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ త్వరలో అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీపై సంబంధిత మంత్రిత్వ శాఖతో చర్చిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి జర్నలిస్టుకూ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు, జర్నలిస్టులు పాల్గొన్నారు

కారు ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు అంజినరెడ్డి

హిందూపురం అర్బన్: కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురం మండలం ఊడగలపల్లికి చెందిన అంజనరెడ్డి(60)ని సోమవారం రాత్రి సైకిల్‌పై వెళుతుండగా... కారు ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన అంజనరెడ్డిని కుటుంబసభ్యులు వెంటనే హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఘటనపై అప్‌గ్రేడ్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హెచ్చెల్సీలో మృతదేహం వెలికితీత

బొమ్మనహాళ్: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన విజయ్‌కుమార్ (52) మృతదేహాన్ని సోమవారం వెలికి తీశారు. శనివారం బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లుకు కుటుంబసభ్యులతో కలసి వచ్చిన ఆయన హెచ్చెల్సీలో స్నానం కోసం దిగి గల్లంతైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం కణేకల్లు మండలం గనిగేర గ్రామ సమీపంలో కాలువలో మృతదేహం కనిపించడంతో వెలికి తీసి కణేకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు మదన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు.